# కస్టమ్స్‌లో కష్టాలు

"ఈసారి ఇండియా ప్రయాణంలో కొనే గిఫ్టులేవీ కష్టమ్స్‌లో ఇబ్బంది లేకుండా చూడు. అసలే ముంబాయ్‌లో దిగుతున్నాం. మనల్ని ఎలా నంజుకుతిందామా అని చూస్తుంటారక్కడ" అని ముందే సలహా ఇచ్చాడు లక్ష్మీపతి

తెచ్చినవి చిన్న చిన్న కానుకలే అయినా, అన్నీ కష్టమ్స్‌వారి రూల్సు పరిధిలోనే వున్నా ఐదేళ్ళక్రితం ఇండియా వెళ్ళినప్పుడు జరిగిన సంఘటన తల్చుకుని కొంచెం అధైర్యపడింది లక్ష్మి.

పోయినసారి తను ఒంటిరిగా ఇండియా వెళ్ళినప్పుడు, దుబాయ్ విమానంలోనించి దిగి, తన ముందు నుంచున్న మలయాళీ మిత్రుడ్ని ఆపాడు కష్టమ్స్ ఆయన ఎక్స్‌రేలో కామ్ కార్డర్లు కనపడ్డాయని.

మలయాళీ మిత్రుడు నవ్వి "అవును సార్. లేటెస్ట్ మోడల్"అని పాస్‌పోర్ట్‌లో రెండు వంద డాలర్ల బిల్లులు పెట్టి అందరికీ కనపడేడట్టుగానే ఇచ్చాడు.

ఆ కష్టముడెంతో ఇష్టపడి "వెళ్ళండి సార్. మీ కొచ్చిన్ ఫ్లైట్‌కి ఆలస్యమవుతుందేమో! ఎందుకొచ్చిన చెకింగ్" అని ఏమీ చెక్ చేయకుండానే అతన్ని పంపించేశాడు. ఆలాగే కనీసం ఇద్దరు ముగ్గురి దగ్గర ఏమీ కష్టపడకుండా వంద డాలర్ల బిల్లులు సంపాదిస్తున్న కష్టమాసురులను చూసి అదిరిపడింది లక్ష్మి. అమెరికాలో ఎంతో కష్టపడి నెలరోజుల్లో సంపాదించే డాలర్లు, ఈ కష్టంబాబాలు ఒక గంటలో సంపాదిస్తున్నారు అనుకుంది. మనమేమనుకున్నా పేగులు లెఖ్ఖపెట్టటంలో ఆరితేరిన ఆ నికృష్ట కష్టమయ్య, లక్ష్మి తెచ్చిన ప్రతి సూట్‌కేసూ తెరిచి, ప్రతి చీర మడతా విప్పి, అన్నీ కెలికేసి అక్కడే కుప్పగా క్రింద పడేసి హిందీలో ఏదోఅన్నాడు. హిందీ అర్ధం కాని లక్ష్మి, తెలుగులో అతన్ని తిట్టుకుని, అవన్నీ మళ్ళీ సూట్‌కేస్‌లో సర్దుకుని, అక్కడినించీ డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు కొచ్చేసరికి, తను ఎక్కవలసిన విమానం తనని ఎక్కించుకోకుండానే ఆకాశంలోకి ఎగిరిపోయింది.

అది గుర్తుకి తెచ్చుకుని నీరసపడిపోయిన లక్ష్మితో అన్నాడు లక్ష్మీపతి "అందుకనే ఈసారి ముంబాయిని బొంబాయికి వదిలేసి, డైరెక్టుగా ఫ్రాంక్‌ఫర్ట్‌నించి బెంగుళూర్ వెళ్ళే ఫ్లైట్‌కి బుక్ చేసింది. నో బాంబే దిస్ టైమ్"

ఆ మాట విన్న లక్ష్మికి అప్పుడే గుడివాడ దగ్గర లక్ష్మీపురం వెళ్ళినంత ఆనందమేసింది. తర్వాత లక్ష్మీపురం కాకి ద్వారా తెలిసిన కబురేమిటంటే బెంగుళూరులో కష్టమ్స్‌లో ఏమీ కష్టం లేకుండా బయట పడ్డారని.

అలాగే ఇండియానించి అమెరికా వచ్చే భారతీయులని అడిగే ఒకే ఒక ప్రశ్న "మీ దగ్గర ఊరగాయలేమన్నా వున్నాయా?" అని.

అమలాపురంనించి అల్లుడ్నీ కూతుర్నీ చూసిపోదామని వచ్చిన అబద్ధమా

డని హరిశ్చంద్రుడుగారు "ఆవకాయ, మాగాయ తేలేదు కానీ, గన్ పౌడర్ మాత్రం తెచ్చాను" అని చెప్పగానే, మరుక్షణం సెక్యూరిటీ పోలీసులు ఆయన్ని పక్క గదికి తీసుకుపోయి తలుపులు వేశేశారు కొంతమంది తెలుగువాళ్ళు కలగజేసుకుని, "అయ్యా! గన్ పౌడర్ అంటే కందిపొడుం అది ప్రాంతీయ పరిభాషలో వాడేమాట. మనుష్యుల్ని తినే తుపాకులకీ, మనుష్యులు తినే కందిపొడుంకీ ఏమీ సంబంధంలేదు" అని ఎంతో నచ్చచెప్పవలసి వచ్చిందిట

నేనూ ఫ్రాంక్ కలిసి మార్కెటింగ్ బిజినెస్ పనిమీద ఫ్రాన్స్‌కి వెళ్ళినప్పుడు అదో అనుభవం. ఫ్రాంక్ మంచిమనిషే అయినా అతనికి కాని చోట కాస్త పోజుకొట్టే అలవాటుంది అది ఆ రోజు మమ్మల్ని ఎంతో ఇబ్బంది పెట్టింది.

పారిస్ ఛార్ల్స్ డిగాల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగి, లగేజ్ పికప్ చేసుకుని, కష్టమ్స్ కౌంటర్ దగ్గరికి వెళ్ళాం ఇద్దరం. ఫ్రాంక్ బిజినెస్ సూట్‌కేస్‌లో కొన్ని ఇంజనీరింగ్ శాంపిల్స్ వున్నాయి. వాటిని అక్కడ కష్టమర్లకి చూపిస్తూ, నేను ఒక టెక్నికల్ ప్రజెంటేషన్ ఇవ్వవలసివుంది. అందుకని మా ఆఫీసులో జూలీ చేత కావలసిన పేపర్ వర్క్ చేసి అవన్నీ తీసుకువచ్చాం. ఆ కాగితం చూపించి దడదడా తన మాతృభాష బ్రిటిష్ ఇంగ్లీష్‌లో మాట్లాడేస్తున్నాడు ఫ్రాంక్.

అసలే ఫ్రెంచి కష్టమ్స్‌వాడేమో ఫ్రాంక్ భాష అర్థంకాక కష్టపడిపోయాడత ను. ఇంకెవర్నో ఇంగ్లీష్ మాట్లాడే అతన్ని పిలిచాడు. వాళ్ళిద్దరూ ఆ కాగితాన్ని అన్ని కోణాల్లోనూ పరీక్షించి, ఆ పేపరు చేయాల్సిన పద్ధతిలో చేయలేదనీ, ఆ ఇంజనీరింగ్ శాంపుల్స్ బయటకి తీసుకువెళ్ళటానికి వీల్లేదనీ అన్నాడు ఫ్రెంచి కలిపిన ఇంగ్లీషులో

"జూలీ ఎప్పుడూ తప్పులు చేయదు. సరిగ్గా చూడండి" అన్నాడు ఆరడుగుల ఫ్రాంక్ ఆరు నూరైనా, నూరు ఆరైనా, ఆరడుగుల పొడుగున్నా ససేమిరా వీల్లేదన్నాడు ఆ అయిదడుగుల పెద్దమనిషి.

ఫ్రాంక్ కోపంగా "ససేమిరా అంటే ఏమిటో, ఏ భాషో నాకు తెలీదు పో.. పో... పో!" అన్నాడు.

"నేనిక్కడే ఉద్యోగం చేస్తున్నాను. కనుక నువ్వే పో. కానీ ఈ సామాన్లు ఇక్కడే వదిలేసి పోవాలి" అన్నాడు ఫ్రెంచ్ ఆయన

"ఇవిక్కడే వదిలేస్తే, మా కష్టమర్లకేం చూపిస్తాం కష్టమ్సూ" అన్నాడు ఫ్రాంక్. అతని తెల్లటి ముఖం బాగా ఎర్రబడింది.

ఈయన బ్రిటిష్ ఇంగ్లీష్‌లోనూ, ఆయన ఫ్రెంచ్ ఇంగ్లీష్‌లోనూ ముందు అరుచుకున్నారు. తర్వాత ఈయన టెక్సాస్ ఇంగ్లీష్‌లో, ఆయన ఇంగ్లీష్ ఫ్రెంచ్‌లో కరుచుకున్నారు. అదిచూసి ఎయిర్‌పోర్ట్ పోలీసువాడు మావేపే వస్తున్నాడు.

ఫ్రాంక్‌తో అన్నాను "నువ్వు పక్కకి పద ఈ విషయం నాకొదిలేయ్. లేకపోతే ఈ నాలుగురోజులూ, నేను అక్కడ కష్టమర్లకి ప్రెజెంటేషన్లు ఇస్తుంటే, నువ్విక్కడ ఎంచక్కా జైల్లో కూర్చుందువుగాని"

ఏమనుకున్నాడో ఏమో కానీ అక్కడే కిటికీ దగ్గరకి వెళ్ళి కోటు జేబుల్లో చేతులు పెట్టుకుని నుంచున్నాడు ఫ్రాంక్

నేను ఫ్రాన్స్ వెడుతున్నానని మా మూర్తిగారితో చెప్పినప్పుడు ఆయన హాస్యంగా అన్నాడు "మీరక్కడ ఇండియన్ ఇంగ్లీష్‌లో మాట్లాడినా ఫరవాలేదు తెలుగులో మాట్లాడినా ఫరవాలేదు. మీకు ఫ్రెంచ్‌వాళ్ళు సహాయం చేస్తారు. కానీ మీ ఫ్రాంక్ బ్రిటిష్ ఇంగ్లీష్‌లో మాట్లాడితే మాత్రం ఇంతే సంగతులు"

ఆ క్షణంలో మా మూర్తిగారు చెప్పింది అక్షరాలా నిజమనిపించింది. బ్రిటిష్‌వాళ్ళన్నా, వాళ్ళ భాషన్నా ఫ్రెంచ్‌వాళ్ళ కసహ్యం.

ముందుగా ఫ్రాంక్ ప్రవర్తనకి సారీ చెప్పాను. తర్వాత ఆ ఇంజనీరింగ్ శాంపిల్స్ మా కక్కడ ఎంత అవసరమో చెప్పాను. జూలీ సరిగ్గా పేపర్ వర్క్ చేయ కపోవటం నిజంగా తప్పేనని ఒప్పేసుకున్నాను.

ఫ్రాంక్ మర్యాదగా మాట్లాడివుంటే వాళ్ళ సూపర్‌వైజర్‌తో చెప్పి ఏమీ కష్టం లేకుండా సహాయం చేసుండే వాడినన్నాడు అతను. పోనీ ఇప్పుడు మీ సూప ర్‌వైజర్‌తో మాట్లాడదామా అని అడిగాను.

"అబ్బే! అదేమీ అఖ్కర్లేదు. క్లియరెన్స్ కాగితం మీద ఈ రెండు మూడు చోట్లా మీరు ఫిలప్ చేసి, సంతకం పెట్టండి చాలు" అన్నాడు.

ఆ పని చేయగానే "ఇక మీరు వెళ్ళచ్చు" అన్నాడు.

"ఏమిటి వాడికి లంచం పెట్టావా?" అడిగాడు ఫ్రాంక్ అనుమానంగా.

నవ్వి "లేదు. ఆ అవసరం వస్తే నా డబ్బులెందుకిస్తాను. నీ దగ్గరే తీసుకునే వాణ్ని కదా" అని ముందుకి నడిచాను.

ఈమధ్య సెప్టెంబర్ 11 గొడవయాక, అమెరికాలో ఎయిర్ పోర్ట్ సెక్యూరి టీ ఎక్కువయింది. ఇది కష్టమ్స్‌వారికి సంబంధం లేకపోయినా, కొత్త అనుభవం కనుక వ్రాస్తున్నాను.

నా కళ్ళజోడుకి వున్న రెండు స్క్రూలలో ఒకటి కొంచెం లూజుగా వుంది. అందుకని నా జేబులో ఒక ముప్పావు అంగుళం పొడుగున్న స్క్రూడ్రైవర్ పెట్టుకు న్నాను. ఇలాటి ఎంతో చిన్న స్క్రూడ్రైవర్‌లు కేవలం కళ్ళజోడు రిపైర్ కోసమే వాడతారు. సెక్యూరిటీ గేట్లో బీప్ బీప్ అనగానే, ఆ స్క్రూడ్రైవర్‌ని తీసుకున్నాడు సెక్యూరిటీ ఆయన.

"ఇలాటివి తీసుకు వెళ్ళకూడదు. రూల్స్‌కి విరుద్ధం" అన్నాడు.

"ఎందుకని" అడిగాను.

"దీన్ని ఒక వెపన్‌గా వాడే అవకాశం వుంది. అందుకని" అన్నాడు కానీ, అతని మాటలు అతనికే వింతగా వున్నట్టనిపించాయి.

అంత చిన్న స్క్రూడ్రైవర్‌ని వెపన్ అంటాడేమిటా అని ఆశ్చర్యపోతూ వుంటే, అతనే నాకొక చిన్న కవర్ ఇచ్చి "దీనిమీద మీ అడ్రస్ వ్రాసి ఇవ్వండి. మీ స్క్రూడ్రైవర్‌ని మా ఖర్చులతో పోస్ట్‌లో పంపిస్తాం" అన్నాడు.

నేను నవ్వి, దాన్ని పక్కనే వున్న గార్బేజ్ డబ్బాలో పడేసి, ముందుకి నడిచాను.

* * *